గ్రంథాలయాల సెస్ వసూలు చేయాలి

ప్రజాశక్తి - పెదపూడి

మండలంలోని గ్రామ సచివాలయాల్లో ఇంటి పన్నుతో పాటు వసూలు చేసిన గ్రంథాలయ సెస్సు వెంటనే సంబంధిత ప్రధాన జిల్లా గ్రంథాలయానికి చెల్లించాలని గ్రామ సచివాలయాల కార్యదర్శులకు ఈఓపిఆర్డి కె.హరిశ్చ సత్యారెడ్డి ఆదేశించారు. పేండ్ల సచివాలయాన్ని ఆయన సోమవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పలు రికార్డులు పరిశీలించి మాట్లాడుతూ రికార్డులు ఎప్పటికప్పుడు సక్రమంగా అమలు చేయాలన్నారు. వేసవి ఎండలు పెరుగుతున్న నేపథ్యంలో గ్రామాల్లో తాగునీరు ఎద్దడి లేకుండా అవసరమైన చర్యలు అన్ని చేపట్టాలన్నారు. పారిశుధ్యం చర్యలు మెరుగుపర్చాలన్నారు. వీధిలైట్లు పగటిపూట వెలగకుండా తగిన చర్యలు చేపట్టాలన్నారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

15 నుండి చేపల వేట నిషేధం

ప్రజాశక్తి - కాకినాడ

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రాదేశిక సముద్ర జలాలలో మెకానిజెడ్, మోటారు బోట్లు ద్వారా నిర్వహించే చేపల వేటను ఈ నెల 15వ తేదీ నుండి జూన్ 14 వరకు సుమారు 61 రోజులపాటు నిషేధిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు మత్స్యశాఖ జిల్లా అధికారి పివి సత్యనారాయణ పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు. వివిధ చేపలు, రొయ్యల జాతులు సంతానోత్పత్తి కాలంలో తల్లి చేపలు, రొయ్యలను సంరక్షించడం, వాటి సంతతి పెరుగుదలను ప్రోత్సహించడం, తద్వారా సముద్ర మత్స్య సంపద సుస్థిరతను సాధించడమే ముఖ్య ఉద్దేశంతో ఈ చేపల వేటను నిషేధించినట్లు తెలిపారు.

ఈ నిషేధ ఉత్తర్వులను అనుసరించి, సముద్ర జలాలలో మేకనైజడ్, మోటారు బోట్లపై మత్స్య కారులు ఎటువంటి చేపలవేట చేయకుండా మత్స్య అభివృద్ధికి సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. నిషేధ ఉత్తర్వులను ఉల్లంఘించి చేపల వేట సాగిస్తే ఆయా బోట్ల యజమానులను ఆంధ్రప్రదేశ్ సముద్ర మత్స్య క్రమ బద్ధీకరణ చట్ట ప్రకారం శిక్షార్హులన్నారు. అట్టి వారి బోట్లను, బోట్లలో ఉండే మత్స్య సంపదను స్వాధీన పరుచుకుని, జరిమానా విధిస్తూ, డీజిల్ ఆయిల్ రాయితీ, ప్రభుత్వం అందించే అన్నీ రకాల రాయితీ సౌకర్యాలను నిలుపుదల చేస్తామని హెచ్చరించారు. ఈ నిషేధ కాలాన్ని కచ్చితంగా అమలు చేయడానికి మత్స్యశాఖ, కోస్ట్ గార్డ్, కోస్టల్ సెక్యూరిటీ పోలీసులు, నేవీ, రెవెన్యూ అధికారులతో గస్తీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ వేటనిషేధ కాలానికి రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకార భరోసా పథకం కింద అందించే వేట నిషేధ భృతికి లబ్ధిదారుల ఎంపిక నిమిత్తం ఈ నెల 17వ తేదీన బోటు, బోటు యజమానులు, కళాశీల వివరాల సేకరణ చేస్తామన్నారు. ఆ సమయంలో బోటు యజమానులు వారితో పాటుగా బోటు రిజిస్ట్రేషన్, లైసెన్స్ నఖలు, వారి బోటులో పనిచేసే మత్స్యకారుల ఆధార్ కార్డ్, రేషన్ కార్డ్, బ్యాంక్ పాస్‌బుక్ మొదటి పేజీ నఖల్లుతో హాజరుకావాలని జిల్లా మత్స్య శాఖ జిల్లా అధికారి పివి సత్యనారాయణ కోరారు.

దాళ్వా కోతలు ప్రారంభం

- బొండాలు కొనుగోలు పై స్పష్టత కరవు

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

వరి పంట కోత యంత్రాలతో వేట్లపాలెంలో ప్రారంభమైన నూర్పిడి పనులు

జిల్లాలో దాళ్వా వరి పంట కోతలకు రైతులు శ్రీకారం చుట్టారు. సామర్లకోట మండలంలో దాళ్వా వరి పంట ముందస్తుగా బోర్ల క్రింద, కాల్వలకు సమీపంలో ఉడ్చిన పంట పొలాలు పక్వానికి రావడంతో మండలంలోని వేట్లపాలెం, జి.మేడపాడు, పెదబ్రహ్మదేవం గ్రామాల్లో దాళ్వా వరి పంట కోతలను ప్రారంభిం చారు. మిషన్లతో పంట కోతలు ప్రారంభించారు. గంటకు రూ.2,400 నుండి రూ.2,600 వరకూ వరి పంట కోత యంత్రాలకు అద్దెగా తీసుకుంటున్నారు. ప్రస్తుత అనుకూల పరిస్థితుల్లో ఎకరా పంట కోతకు వరి పంట కోత యంత్రంతో సుమారు గంట పావు నుండి గంటన్నర సమయం పడుతుంది.

మండల పరిధిలోని 18 గ్రామాల్లో 75 శాతం మంది రైతులు బొండాలు రకాన్ని సాగు చేశారు. 30 శాతం మంది రైతులు 1121 రకంను సాగు చేశారు. అయితే ప్రభుత్వం రెండు రోజుల్లో ధాన్యం కొనుగోలు ప్రక్రియను జిల్లా వ్యాప్తంగా రైతు భరోసా కేంద్రాల్లో ప్రారంభించుటకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే సిబ్బందికి శిక్షణలు ఇవ్వడమే కాకుండా, సిఎంఆర్ ఇచ్చిన రైసు మిల్లుల నుండి ఆయా రైతు భరోసా కేంద్రాలకు గోనె సంచులను సరఫరా చేస్తున్నారు. ఆయా ఆర్‌బికెలకు దగ్గరలోవున్న రైసు మిల్లులకు కొనుగోలు చేసిన ధాన్యాన్ని తరలించేలా ఏర్పాటు చేశారు. అయితే బొండాలు రకం ధాన్యం కొనుగోలుపై ఇప్పటివరకూ ప్రభుత్వం నుండి స్పష్టమైన ఆదేశాలు లేవని వ్యవసాయ, పౌరసరఫరాల అధికారులు చెబుతున్నారు. బొండాలు రకం కొనుగోలు చేస్తే వాటిని బాయిల్డ్ రైసు మిల్లులకు తరలించాల్సి ఉంటుంది. అయితే తొలకరి సీజన్‌లో రైతులకు ధాన్యం కొనుగోలు బకాయిలు చెల్లింపులు దాదాపుగా పూర్తి అయినప్పటికి, మండల పరిధిలో రవాణా, హమాలీ చార్జీ చెల్లింపుపై స్పష్టత లేదని సమాచారం. ఎంతమందికి రవాణా చార్జీలు, హమాలీ చార్జీలు అకౌంట్లలో వేశారో నిర్దిష్ట సమాచారం లేనట్లు తెల్సింది. దాంతో రైతులును అడిగినా బకాయిలపై సరైన సమాధానం చెప్పలేక పోతున్నారు. ఈ నెలాఖరునాటికి మండలంలో దాళ్వా పంట కోతలు ముమ్మరం అయ్యే అవకాశాలున్నాయి. వెనుక సాగు చేసిన సామర్లకోట, భీమవరం, వికె రాయపురం, బోయినపూడి, మాధవ పట్నం, ఉండూరు, అచ్చంపేట, గొంచాల, నవర, పవర, పండ్రవాడ, పనసపాడు, చంద్రంపాలెం, కాపవరం తదితర గ్రామాల్లోవరి పంట కోతలు ప్రారంభం అయ్యేందుకు ఈ నెలాఖరుకు సమయం పడుతుందని రైతులు చెబుతున్నారు. బొండాలు రకం ఎకరాకు 40 నుండి 45 బస్తాలు దిగుబుడులు రావచ్చునని రైతులు ఆశిస్తున్నారు. ప్రభుత్వం రైతులు నష్ట పోకుండా బొండాలు రకం ధాన్యం కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

యూనిట్ల గ్రౌండింగ్ పూర్తి చేయాలి

అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా

ప్రజాశక్తి - కాకినాడ

వైఎస్సార్ చేయూత, ఆసరా పథకాల లబ్ధితో మత్స్య, పశుసంవర్ధక శాఖల పరిధిలో మంజూరు చేసిన వివిధ యూనిట్లను త్వరితగతిన గ్రౌండింగ్ పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా అధికారులకు ఆదేశించారు. సోమవారం కాకినాడ కలెక్టర్ కార్యాలయంలో చేయూత, ఆసరా లబ్ధితో మంజూరు చేసిన యూనిట్ల గ్రౌండింగ్, బ్యాంకు రుణాలు తదితర అంశాలపై జిల్లా కలెక్టర్ కతికా శుక్లా గ్రామీణ అభివృద్ధి, మెప్మా, మత్స్య, పశుసంవర్ధక, లీడ్ బ్యాంకు, పంచాయతీ, వివిధ మున్సిపాలిటీల కమిషనర్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా గ్రామీణాభివృద్ధి, మెప్మా స్వయం సహాయక సంఘాల మహిళలకు చేయూత, ఆసరా పథకాల లబ్ధితో మత్స్య, పశుసంవర్ధక శాఖలలో మంజూరు చేసిన వివిధ యూనిట్లకు సంబంధించి నూరు శాతం గ్రౌండింగ్ పూర్తి చేయాలన్నారు. ఇందుకు గ్రామీణ అభివృద్ధి, మెప్మా, మత్స్య, పశుసంవర్ధక, లీడ్ బ్యాంకు, పంచాయతీ శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. లబ్ధిదారుల డాక్యుమెంటేషన్, బ్యాంకు రుణాల మంజూరు తదితర అంశాలపై అధికారులు ప్రత్యేక దృష్టిపెట్టాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. మత్స్య శాఖకు సంబంధించి ప్రధానమంత్రి మత్స్య సంపదయోజన, ఫిష్ ఆంధ్రా పథకాలపై లబ్ధిదారులకు మరింత అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో డిఆర్‌డిఎ పీడీ కె.శ్రీరమణి, మెప్మా పీడీ బి.ప్రియంవద, పశుసంవర్ధక శాఖ జేడీ ఎస్. సూర్యప్రకాశరావు, జిల్లా మత్స్య శాఖ అధికారి పి.సత్యనారాయణ, డిపిఒ ఆర్.విక్టర్, ఎల్‌డీఎం సీహెచ్‌ఎస్వీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన కొత్త కమిషనర్

కాకినాడ కార్పొరేషన్ కమిషనర్‌గా మహేష్ కుమార్ బాధ్యతల స్వీకరణ

కలెక్టర్ కృతికా శుక్లాకు మొక్క అందజేస్తున్న కమిషనర్ మహేష్ కుమార్

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

కాకినాడ నగరపాలక సంస్థ నూతన కమిషనర్‌గా నియమితులైన రావిరాల మహేష్ కుమార్ సోమవారం మధ్యాహ్నం కాకినాడ కలెక్టరు కార్యాలయంలో జిల్లా కలెక్టర్ కృతికా శుక్లాను మర్యాదపూర్వకంగా కలిశారు. కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్‌గా మహేష్ కుమార్ రావిరాల ఐఎఎస్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. పంచాయతీరాజ్ అండ్ గ్రామీణా భివృద్ధి శాఖ అదనపు కమిషనర్‌గా పనిచేస్తున్న ఆయన బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఉదయం 10.30 కు ప్రస్తుత కమిషనర్ కే.రమేష్ నుంచి ఆయన బాధ్యతలు తీసుకున్నారు. 2016 క్యాడర్‌కు చెందిన ఆయన గతంలో రాజమహేంద్ర వరం సబ్ కలెక్టర్‌గా జిల్లాలో కొంతకాలం పనిచేశారు. తొలిసారిగా నగరపాలక సంస్థ కార్యాలయానికి వచ్చిన కమిషనర్‌కు అదనపు కమిషనర్ సిహెచ్ నాగ నరసింహారావు, వివిధ విభాగాధిపతులు స్వాగతం పలికారు.

అనంతరం కమిషనర్ మహేష్‌కుమార్ మీడియాతో మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధుల సమన్వయంతో నగరపాలక సంస్థ ద్వారా ప్రజలకు మరిన్ని మెరుగైన సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటాన న్నారు . ప్రభుత్వ ప్రాధాన్యతాంశాలు, నగరపాలక సంస్థకు చెందిన ముఖ్య మైన అంశాలపై దష్టి పెడతామన్నారు. కాగా నూతన కమిషనర్ మహేష్ కుమార్‌ను ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ హరిప్రసాద్, నగరపాలక సంస్థ కార్యదర్శి ఎమ్. ఏసుబాబు, డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్, స్మార్ట్ సిటీ ఎస్ఈ వెంకట్రావు, ఎంహెచ్‌ఓ డాక్టర్ పృథ్వీ చరణ్, మేనేజర్ కర్రి సత్యనారాయణ, డిసిపి హరిదాసు, ఏసిపి నాగశాస్త్రులు, ఏవో శిరీష్, ఉద్యాన శాఖ ఏడి టీవీ సిరిల్, టిపిఆర్ఓ మానే కష్ణమోహన్, పలువురు డిఇలు, ఎఇలు మర్యాదాపూర్వకంగా కలిశారు.

జివికె స్టాక్ పాయింట్ పరిశీలన

ప్రజాశక్తి -రౌతులపూడి

రౌతులపూడిలో ఆర్‌జెడి జి.నాగమణి సోమ వారం పర్యటించారు విద్యాశాఖ కార్యాలయంలోని జివికె స్టాక్స్ పాయింట్‌ను పరిశీలించి, అధికారులతో ఆమె సమావేశం నిర్వహించారు. మండలంలో చేపడుతున్న నాడు నేడు పనుల పురోగతిపై ఆమె సమీక్షించారు ఎంఇఒ ఎస్‌వి నాయుడు. ఎంపిడిఒ గోవిందు, పలువురు అధికారులు ఉన్నారు.

నేడు జ్యోతిరావు పూలే, అంబేద్కర్ విగ్రహాల ఆవిష్కరణ

ప్రజాశక్తి - పెదపూడి

మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 11వ తేదీ ఉదయం 10 గంటలకు మహాత్మ జ్యోతిరావు పూలే. డాక్టర్ బీ.ఆర్. అంబేద్కర్ విగ్రహాలను ఆవిష్కరిస్తున్నట్టు సోమవారం ఎంపిపి కేతా తులసి తెలిపారు. ముఖ్య అతిథులుగా ఎంఎల్ఎ డాక్టర్ సత్తి సూర్య నారాయణరెడ్డి, రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్ చంద్రబోష్ హాజరు కానున్నారని, మండంలోని ప్రజాప్రతి నిధులు, కార్యకర్తలు హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

అడబాల రామం మృతి తీరని లోటు

ప్రజాశక్తి - పిఠాపురం

పిఠాపురం భవన నిర్మాణ కార్మిక సంఘం స్థాపనలో ముఖ్యుడు అయిన అడబాల రాము మృతి తీరని లోటని సిపిఎం, సిఐటియు నాయ కులు అన్నారు. సోమవారం బొజ్జ వారి తోటలో రాము స్వగృహానికి వెళ్లి ఆయన పార్థివ దేహానికి పూలమాలు వేసి నివాళు లర్పించి, ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలియజేశారు. డి.సత్య నారాయణ, కోనేటి రాజు, కరణం విశ్వనాథం, కే చిన్న వీరబాబు ఎస్ సత్తిబాబు కే రమణ డి గోపాలకష్ణ నాగేశ్వరరావు ఉన్నారు.

విద్యుత్ ఛార్జీల పెంపుపై టిడిపి నిరసన

- సబ్‌స్టేషన్ల ముట్టడి..
- జిల్లా వ్యాప్తంగా ధర్నాలు, రాస్తారోకోలు
- పెంచిన ఛార్జీలు తగ్గించాలని డిమాండ్

ప్రజాశక్తి - యంత్రాంగం

రాష్ట్ర ప్రభుత్వం పెంచిన విద్యుత్ ఛార్జీలకు నిరసనగా తెలుగుదేశం పార్టీ రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా సోమవారం జిల్లా వ్యాప్తంగా విద్యుత్ సబ్‌స్టేషన్లను ముట్టడించి, విద్యుత్ ఇంజనీర్ కార్యాలయాల వద్ద టిడిపి నాయకులు నిరసన తెలియజేస్తూ ధర్నాలు నిర్వహించి, ప్రధాన రహదారుల వద్ద రాస్తారోకోలు చేశారు. ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని డిమాండ్ చేశారు.

కాకినాడలో ధర్నా చేస్తున్న మాజీ ఎంఎల్ఎ కొండబాబు, టిడిపి శ్రేణులు

ప్రత్తిపాడు ఎఇ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న టిడిపి శ్రేణులు

కాకినాడ కార్పొరేషన్ : కాకినాడ ఎలక్ట్రికల్ డివిజనల్ ఇంజినీర్ కార్యాలయం సబ్ స్టేషన్ వద్ద టిడిపి నాయకులు, కార్యకర్తలు వైసీపీ ప్రభుత్వం పెంచిన విద్యుత్ ఛార్జిలకు నిరసనగా ధర్నా నిర్వహించారు. జగన్ రెడ్డి ప్రభుత్వం ప్రజా ధనం లూటీ కోసమే వినియోగదారులపై అక్రమ మార్గంలో విద్యుత్ చార్జీలు భారం మోపుతున్నారని కాకినాడ సిటీ మాజీ ఎంఎల్ఎ వనమాడి కొండబాబు విమర్శించారు. అనంతరం వైసిపి ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించా లని డిమాండ్ చేస్తూ జెఇకి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మల్లిపూడి వీరు, గదుల సాయిబాబా, తుమ్మల రమేష్, చిక్కాల సత్యవతి, తుమ్మల సునీత, మీసాల సునీత, ఎల్లమ్మ, అమన్ జైన్, పంతాడి రాజు, షేక్ రహీమ్, ఎండీ ఆన్సర్, చింతా పేర్రాజు, రేకాడి లోవరాజు పాల్గొన్నారు. **తాళ్లరేవు** మండల ప్రధాన కార్యదర్శి కట్టా త్రిమూర్తులు, తెలుగు యువత రాష్ట్ర నాయకులు డి.బాబి ఆధ్వర్యంలో ఉంగరాల వెంకటేశ్వరరావు, పొన్నమండ రామలక్ష్మి, వాడ్రేవు వీరబాబు, టేకుమూడి లక్ష్మణరావు, మోపురి వెంకటేశ్వరరావు, కుడుపూడి రామకృష్ణ, బోయిడి వేణుగోపాల్, దాసరి వేణుగోపాల్,ఎరికే వీరన్న, వాకపల్లి చిరంజీవి, దెయ్యాల జానీ, ఎన్ మూర్తి తదితరులు విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ధర్నా నిర్వహించి, తాళ్ళరేవు మెయిన్ రోడ్డు పైన రాస్తారోకో చేసి పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని డిమాండ్ చేశారు. **కాజులూరు** మండలం ఆర్యవటంసబ్ స్టేషన్ వద్ద రామచంద్రపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి రెడ్డి సుబ్రహ్మణ్యం ఆదేశాల మేరకు సబ్ స్టేషన్ వద్ద రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి రాయుడు లీల శంకర్, సలాది పుష్పవతి వనము వీరబ్రహ్మం వల్లు అర్జున్ రావు బొమ్మిడి సోమలమ్మ పేపకాయలు బాబ్జి నందికొల్ల అన్నవరం తదితరులు ధర్నా నిర్వహించారు. **ఏలేశ్వరం** ప్రత్తిపాడు సబ్ స్టేషన్ వద్ద ప్రత్తిపాడు నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ వరుపుల సత్య ప్రభ ఆధ్వర్యంలో ప్రత్తిపాడు సబ్‌స్టేషన్ వద్ద నిరసన చేపట్టి అనంతరం సబ్ ఇంజనీర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. టిడిపి నాయకులు కొమ్ముల కన్నబాబు, జ్యోతుల పెదబాబు, యాళ్ళ విశ్వేశ్వరరావు, మూది నారా యణస్వామి, ఉల్లి వీరభద్రరావు, యాళ్ల జగదీష్, వెన్న శివ, పైల సాంబశివ రావు, ఇతంశెట్టి భాస్కరరావు, పసగడుగుల రమణ పాల్గొన్నారు. **పెదపూడి** మండల పార్టీ అధ్యక్షులు జుత్తుక కృష్ణ, పుట్ట గంగాధర చౌదరి ఆధ్వర్యంలో టిడిపి నేతలు కార్యకర్తలు ఆందోళన నిర్వహించారు. గొల్లల మామిడాడ, కరకుదురు సబ్ స్టేషన్‌ల ఎదుట నిరసన వ్యక్తం చేసి విద్యుత్ శాఖా అధికారులకు వినతి పత్రం అందజేశారు. సానా శ్రీనివాస రావు, చిర్రా వర ప్రసాద్, మూకల శ్రీరాములు, సహపురం చిన్న బాబు, శివరామారెడ్డి, పలివెల బుజ్జి, పెద వెంకటరమణ, గణేష్, గోపి కృష్ణారెడ్డి పాల్గొన్నారు **గండేపల్లి** మండల టిడిపి అధ్యక్షులు పోతుల మోహనరావు ఆధ్వర్యంలో స్థానిక గండేపల్లి 33 కెవి సబ్ స్టేషన్ వద్ద రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యదర్శి కోర్పు లచ్చయ్య దొర, కార్యకర్త లతో కలిసి సబ్ స్టేషన్‌ను ముట్టడించి, అనంతరం జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. క్లస్టర్ ఇంచార్జ్ పాలకుర్తి ఆదినారాయణ, బొల్లంరెడ్డి రామకృష్ణ, దాపర్తి సీతా రామయ్య, యర్రంశెట్టి బాబ్జి, కంటిపూడి సత్తిబాబు, దిడ్డి శ్రీను, ఎలమాటి కాశి పాల్గొన్నారు. **కరప** మండలం వేళంగి విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద మాజీ ఎంఎల్ఎ పిల్లి అనంతలక్ష్మి సత్యనారాయణ మూర్తిల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. గుబ్బల శ్రీను, టేకుమూడి రామ తారకం, వాసంశెట్టి శ్రీను, లోవరాజు, కోట రామకష్ణ, అనసూరి పాపారాయుడు, క్లస్టర్ ఇన్‌ఛార్జి పలివెల జానకి రామయ్య, గంజా రాంబాబు, మిరపల ప్రకాష్, బొజ్జ భవాని సాంబశివరావు, గుత్తుల లక్ష్మి, పెమ్మాడి శ్రీను, సుంకర కుమార్ పాల్గొన్నారు.

కరపలో ధర్నా చేస్తున్న మాజీ ఎంఎల్ఎ అనంతలక్ష్మి, టిడిపి శ్రేణులు

చలివేంద్రం ప్రారంభించి అర్జీదారులకు మజ్జిగ అందజేస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా

స్పందనకు 285 అర్జీలు

ప్రజాశక్తి - కాకినాడ

కాకినాడ కలెక్టరేట్ స్పందన సమావేశ మందిరంలో సోమవారం జిల్లా స్థాయి స్పందన కార్యక్రమంలో కలెక్టర్ కృతికాశుక్లా డిఆర్ఒ కె.శ్రీధం రెడ్డి, కెఎస్ఈజెడ్ ప్రత్యేక డిప్యూటీ కలెక్టరు కె.మనోరమ, సివిల్ సప్లయ్ కార్పొరేషన్ డీఎం. డి.పుష్పమణి, ఎస్‌సి కార్పొరేషన్ ఇడి డిఎస్ సునీత, డిఆర్‌డిఎ పీడీ కె.శ్రీరమణిలతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వివిధ సంక్షేమ పథకాలు, రెవెన్యూ, పౌర సరఫ రాల సేవలు, నవరత్నాలు–పేదలందరికీ ఇళ్ల పథకం కింద పట్టాల పంపిణీ, ఇళ్ల మంజూరు, పెన్షన్లు, సర్వే, ఉపాధి అవకాశాలు, భూ వివాదాలు తదితరాలకు సంబంధించి మొత్తం 285 అర్జీలు వచ్చాయి. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు మాట్లాడుతూ క్షేత్రస్థాయి అధికా రులతో సమన్వయం చేసుకుని అర్జీదారుని సమస్యను పరిష్కరించి, దీనికి సంబంధించిన ఫోటోలను తప్పనిసరిగా పరిష్కార నివేదికకు జత చేయాలని కలెక్టరు స్పష్టం చేశారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, వివిధ సెక్షన్ల అధికారులు పాల్గొన్నారు.

స్పందన హాలు వద్ద మజ్జిగ చలివేంద్రం ప్రారంభం

ప్రతీ సోమవారం తమ సమస్యలు పరిష్కారానికి వచ్చే అర్జీదారుల దాహార్తిని తీర్చేందుకు స్పందన హాలు వద్ద వికాస ఆధ్వ ర్యంలో ఏర్పాటుచేసిన మజ్జిగ చలివేంద్రాన్ని కలెక్టర్ కృతికా శుక్లా ప్రారంభించారు. ఈమజ్జిగ చలివేంద్రాన్ని ఇక నుంచి ప్రతి సోమ వారం స్పందన హాలు వద్ద నిర్వహిస్తారని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో డిఆర్ఒ కె.శ్రీధర్ రెడ్డి, వికాస పీడీ కె.లచ్చారావు, వికాస సిబ్బంది పాల్గొన్నారు.

పోలీస్ స్పందనకు 43 అర్జీలు

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

కాకినాడ జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా పోలీస్ స్పందన కార్యక్రమానికి 43 అర్జీలు వచ్చాయని అడిషనల్ ఎస్‌పి శ్రీనివాస్ తెలిపారు. ఎస్‌పి రవీంద్రనాథ్ బాబు బదిలీ నేపథ్యంలో, కొత్త ఎస్‌పి ఇంకా బాధ్యతలు స్వీకరించకపోవడంతో ఎఎస్‌పి శ్రీనివాస్ ఫిర్యాదులను స్వీకరించారు. సమస్యల పరిష్కారానికి సంబంధిత పోలీస్ స్టేషన్లకు అర్జీలను పంపించనున్నట్టు ఆయన తెలిపారు. కార్యక్రమంలో డిఎస్‌పిలు అంబికా ప్రసాద్, మురళీకృష్ణారెడ్డి, కాకినాడ సర్కిల్ సిఐలు, ఎస్ఐలు సిబ్బంది పాల్గొన్నారు. **కార్పొరేషన్ కార్యాలయంలో** అదనపు కమిషనర్ సిహెచ్ నాగ నరసింహారావు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల అందించిన ఆర్జీలను స్వీకరించారు. రెవిన్యూ,టౌన్ ప్లానింగ్, మంచినీటికి సంబంధించిన వివిధ అంశాలపై ప్రజలు ఫిర్యాదులు అందజేశారు. కార్యదర్శి ఎం.ఏసుబాబు డి ఈ వెంకట్రావు, మేనేజర్ కర్రి సత్యనారాయణ, డిసిపి హరిదాసు, ఎసిపి నాగశాస్త్రులు, ఎంహెచ్ఒ డాక్టర్ పద్వి చరణ్, టిపిఆర్ఓ కృష్ణమోహన్, అధికారులు పాల్గొన్నారు

లెక్కల పరీక్షకు 25 మంది గైర్హాజరు

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

సామర్లకోట మండలంలోని 9 పరీక్షా కేంద్రాల్లో సోమవారం నిర్వహించిన 10వ తరగతి గణితం పరీక్షకు 25 మంది విద్యార్థులు హాజరుకాలేనట్లు ఎంఇఒ వై.శివరామకృష్ణయ్య తెలిపారు. మొత్తం 1803 మంది విద్యార్థులు హాజరు కావల్సి ఉండగా, 1778 మంది హాజరైనట్లు చెప్పారు. కాగా మండలంలోని వేట్లపాలెం ఎబి పరీక్షా కేంద్రాలను స్క్వాడ్ ఆఫీసరు కుర్మారావు తనిఖీలు చేసి పరీక్షలు జరుగుతున్న తీరును పరిశీలించి పలు సూచనలు ఇచ్చారు.

కార్టూ'నిజం'

అలా అని ప్రశ్నిస్తే.. థర్డ్ డిగ్రీ ప్రయోగిస్తున్నారురా బాబూ..!!

పాలకుల విధానాలు మారేలా ఉద్యమాలు సాగాలి

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంఎల్‌సి ఎంవిఎస్ శర్మ

ప్రజాశక్తి - కాకినాడ

ఆశ్రిత పెట్టుబడిదారీ విధానానికి అదానీ దోపిడీ పరాకాష్టగా నిలిచిందని, పాలకుల విధానాలు మారేలా ఉద్యమాలు సాగాలని మాజీ ఎంఎల్‌సి ఎంవిఎస్ శర్మ పిలుపునిచ్చారు. స్థానిక యుటిఎఫ్ హాలులో రఘుపతి వెంకటరత్నం నాయుడు (ఆర్.వి.ఎన్.) స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి టి. అన్నారాం అధ్యక్షతన అదానీ అవినీతి– క్రోనీ కేపిటలిజం అనే అంశంపై సదస్సు నిర్వహించారు.

ముఖ్యవక్తగా ఎంవిఎస్ శర్మ మాట్లాడుతూ స్వాతంత్ర్యం సాధించిన తరువాత ప్రజల సహకారంతో ప్రభుత్వమే దేశంలో పెట్టుబడి దారీ విధానాన్ని అభివద్ధి చేసిందన్నారు. దీనివల్ల ఇనుము ఉక్కు, విద్యుత్, రైల్వే, మందులు వంటి అనేక రంగాల్లో ప్రభుత్వమే పెట్టుబడులు పెట్టి అభివద్ధి చేసిందన్నారు. దీనివల్ల సామాజిక న్యాయం కొంతవరకు అమలు జరిగి, సోషలిస్టు దేశాలు కూడా సాంకేతిక సహకారాన్ని సంపూర్ణంగా అందించా యన్నారు. అయితే ఇటీవల కాలంలో ప్రభుత్వ రంగాన్ని ఉపయోగించుకుని ప్రైవేటు పెట్టుబడిదారులు బాగా లాభాలు సంపాదించు కున్నారని తెలిపారు. అయితే 2002 గుజరాత్ మారణహోమం తరువాత అదానీ మోడీ బంధం బలపడిందన్నారు. దీనివల్ల కుబేరుల జాబితాలో 608వ స్థానంలో ఉన్న అదానీ 2 వ స్థానానికి ఎదిగాడన్నారు. హిండెన్ బర్గ్ నివేదిక అదానీ ఏవిధంగా సంపదను కొల్లగొడుతున్నాడో బహిర్గతం చేసిందన్నారు. మన దేశంలో జరిగిన రైతాంగ ఉద్యమం మోడీ నల్ల చట్టాలను రద్దు చేయించిందన్నారు. పాలకుల విధానాలు మారే విధంగా ఉద్యమాల మధ్య సమన్వయం జరగాలన్నారు. తద్వారా రాజకీయ ప్రత్యామ్నాయం ఏర్పడుతుం దన్నారు. ఆర్.వి.ఎన్. స్టడీ సర్కిల్ కన్వీనర్ ఐ.ప్రసాదరావు, అంబేద్కర్ ఉద్యమ సీనియర్ నేత అయితాబత్తుల రామేశ్వరరావు, సిఐటియు అఖిల భారత ఉపాధ్యక్షురాలు జి. బేబిరాణి తదితరులు పాల్గొన్నారు. సదస్సు కి వివి రమణ ఆహ్వానం పలుకగా టి. రవి చక్రవర్తి వందన సమర్పణ చేశారు.

ఉద్యోగ నియామక పత్రాలు అందజేస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా

నలుగురికి కారుణ్య నియామకాలు

ప్రజాశక్తి - కాకినాడ

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తూ వివిధ కారణాలతో మరణించిన ఉద్యోగుల కుటుంబీకులకు సోమవారం కాకినాడ జిల్లాస్థాయి స్పందన కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా కారుణ్య నియామకం కింద నలుగురికి ఉద్యోగ నియామక పత్రాలు అందజేశారు. ఖాళీల సంఖ్య, రోస్టర్, సీనియారిటీ ప్రకారం అభ్యర్థులకు పోస్టింగ్స్ ఇచ్చినటుట తెలిపారు. ఉద్యోగం పొందిన అభ్యర్థులు చిత్తశుద్ధి, అంకితభావంతో పనిచేయాలని కలెక్టర్ కృతికా శుక్లా అభ్యర్థులకు సూచించారు. కార్యక్రమంలో డిఆర్ఓ కె.శ్రీధర్ రెడ్డి, కలెక్టరేట్ ఏవో శ్రీనివాసురావు తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

గోపాలపురం సిహెచ్‌సిలో చికిత్స పొందుతున్న చిన్నారులు

కుక్కల దాడిలో పలువురికి గాయాలు

ప్రజాశక్తి - యంత్రాంగం

వేర్వేరు చోట్ల కుక్కల దాడిలో పలువురికి గాయాలయ్యాయి. బాధితులు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు.

జగ్గంపేట పిచ్చికుక్క దాడిలో 25 మందికి గాయాలయ్యాయి జగ్గంపేటలోని దేవి సెంటర్లో సోమవారం ఉదయం కాట్రావులపల్లి గ్రామం వైపు నుంచి దేవి సెంటర్ వద్ద కనిపించిన వారిపై దాడిచేసి గాయపరిచింది. గాయపడిన వారు జగ్గంపేట సిహెచ్‌సి ఆసుపత్రికి వెళ్లి ప్రథమ చికిత్స చేయించుకున్నారు. చికిత్స చేయించుకున్న 25 మందికి ప్రథమ చికిత్స చేసి వారిలో పదిమందిని హిమోగ్లోబిన్ యాంటీ రాబిస్ వ్యాక్సిన్ కోసం కాకినాడ జనరల్ ఆసుపత్రికి పంపించినట్టు జగ్గంపేట ప్రభుత్వ ఆసుపత్రి డాక్టర్ రమేష్ తెలిపారు. కుక్క కాటుకు గురైన వారు క్రమం తప్పకుండా నాలుగుసార్లు యాంటీ రాబిస్ వ్యాక్సిన్ తప్పనిసరిగా వాడాలన్నారు. జగ్గంపేట సచివాలయ అధికారులు వివరణ కోరగా తాము ఈ ఏడాదిలో పలుసార్లు కుక్కలను పట్టించామని గ్రామంలోని కుక్కలు బెడద తక్కువగా ఉందన్నారు అయితే పక్క గ్రామం వైపు నుంచి కుక్క వచ్చి పలువురిని గాయపరిచినట్టు వచ్చిన సమాచారం మేరకు వెంటనే తమ సిబ్బందితో కుక్కను పట్టించామన్నారు. ముందస్తు జాగ్రత్తగా గ్రామంలోని ఎక్కడ కుక్కలు తిరగకుండా చర్యలు తీసుకుంటామని వై.గణేష్ బాబు తెలిపారు. **గోపాలపురం** కుక్క దాడి చేయడంతో ఏడుగురికి గాయాలు అయ్యాయి. వారిలో ముగ్గురికి తీవ్ర గాయాలు కావడంతో గోపాలపురం సిహెచ్‌సిలో చికిత్స పొందుతున్నారు. బాధితులు తెలిపిన వివరాల ఇవి.. తాళ్లపూడి మండలంలోని అన్నదేవరపేటలో గాంధీ బొమ్మ వీధిలో ఒక కుక్క దాడి చేసి ఏడుగురిని గాయపరిచిందన్నారు. అందులో ముగ్గురు చిన్నారులు తాడేపల్లి అస్మిత గ్రేసీ, కస్సే అభివర్ధన్ కుమార్, పోలిమాటి మణికంఠకు తీవ్ర గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం గోపాలపురం సిహెచ్‌సికి తరలించారన్నారు. మిగిలిన వారికి అన్నదేవరపేట పిహెచ్‌సి నందు యాంటీ రాబిస్ వ్యాక్సిన్ వేసినట్లు తెలిపారు. డాక్టర్ చైతన్య రాజు మాట్లాడుతూ కుక్క దాడిలో ముగ్గురుకి తీవ్ర గాయాలు కావడంతో వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ఆరోగ్యం నిలకడగా ఉందని వారు కోలుకున్న తర్వాత డిశ్చార్జ్ చేస్తామన్నారు. అయితే బాధిత తల్లిదండ్రులు తాడేపల్లి దాసు, పోలిమాటి శ్రీను, కస్సే సురేష్ మాట్లాడుతూ గ్రామంలో కుక్కలు బెడద ఎక్కువైందని అన్నారు. పంచాయతీ అధికారులు మాత్రం చూసి చూడనట్టు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. సంబంధిత పంచాయతీ అధికారులు వెంటనే కుక్కలను పట్టుకుని మాకు, మా పిల్లలకు రక్షణ కల్పించాలన్నారు. కోరారు.

కోడి పందేలపై దాడిలో పలువురి అరెస్ట్

ప్రజాశక్తి-నల్లజర్ల

నల్లజర్లలో కోడిపందేలపై పోలీసులు దాడి చేసి 8 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.8,640, 5 ద్విచక్ర వాహనాలు,7 సెల్ ఫోన్లు, ఒక పుంజును, రెండు కోడి కత్తులను స్వాధీనం చేసుకున్నారు. వేరొక దాడిలో పోతినీడి పాలెం గ్రామంలో ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుండి రూ.3600, 2 కోడిపుంజులు, 2 కోడి కత్తులను స్వాధీన పరుచుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు నల్లజర్ల పోలీసులు తెలిపారు.

మంటలార్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

బడుగువానిలంకలో చెత్తకు నిప్పు

మంటలార్పిన అగ్నిమాపక సిబ్బంది

ప్రజాశక్తి - ఆలమూరు

బడుగువానిలంకలో సోమవారం ఘోర అగ్ని ప్రమాదం తప్పింది. స్థానికులు తెలిపిన సమాచారం మేరకు.. బివిలంక శివారున గ్రామానికి ఆనుకుని చెత్త ఉంది. దీనికి స్థానికులు నిప్పు పెట్టడం తో అగ్నికీలలు చెలరేగాయి. దీంతో సమాచారం తెలుసుకున్న సర్పంచ్ దూలం వెంకటలక్ష్మి సత్తిబాబు, ఉప సర్పంచ్ పినమాల జ్యోతి తాతాజీ, వైసిపి నేతలు కటారి గంగరాజు, కటారి కుమార్, యువకులు మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించారు. వీరు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందజేశారు. రాజమహేంద్రవరం అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను పూర్తిగా అదుపు చేశారు. ఈ ఘటనలో మేకల మందకు సంబంధించి ఏర్పాటు చేసిన కంచె పూర్తిగా కాలిపోయింది. పలు మేకలకు స్వల్ప గాయాలయ్యాయి.

నేడు జ్యోతి రావు పూలే జయంతి

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

మండల కేంద్రమైన కపిలేశ్వరపురం బస్టాండ్ సెంటర్లో మంగళవారం 9 ఉదయం గంటలకు మహాత్మ జ్యోతిరావు పూలే జయంతిని ఘనంగా నిర్వహించనున్నట్లు బిసి సంఘం నాయకులు తెలిపారు. సోమవారం వారు మాట్లాడుతూ గ్రామ బిసి సంఘం ఆధ్వర్యంలో పూలే విగ్రహం వద్ద జరిగే ఈ కార్యక్రమానికి అందరూ హాజరు కావాలని ఛారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు జె.మల్లికార్జునుడు కోరారు.

బాలిక వైద్య ఖర్చులకు ప్రవీణ్ చక్రవర్తి సాయం

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

చికిత్స పొందుతున్న సౌమ్య

కాకినాడ రూరల్ అచ్చంపేట జంక్షన్ వద్ద గల మెడికవర్ హాస్పిటల్‌లో బోన్ మ్యారో లుకేమియా మూడో స్థాయిలో ఉన్న క్యాన్సర్ వ్యాధితో బాధ పడుతున్న శికోలు సౌమ్య కాకినాడ చొల్లంగి సాంఘిక సంక్షేమ హాస్టల్‌లో 10వ తరగతి చదువుతోంది. తల్లి దండ్రులు పేదవారు కావడంతో వైద్య ఖర్చుల నిమిత్తం పడుతున్న ఇబ్బందులను గుర్తించిన కాకినాడకు చెందిన ప్రముఖ విద్యావేత్త కేటీసీ విద్యాసంస్థల అధినేత ప్రవీణ్ చక్రవర్తి సోమవారం మెడికవర్ యాజమాన్యానికి రూ.25 వేలు బాలిక వైద్య ఖర్చుల నిమిత్తం అందజేశారు విద్యార్థిని త్వరగా కోలుకోవాలని అవసరమైతే తాను మళ్ళీ తన వంతు సహాయం అందజేస్తానని తెలిపారు.

కలెక్టర్‌కు వినతిపత్రం ఇవ్వడానికి వచ్చిన టిడిపి మహిళా నాయకులు

కల్తీ మద్యం, బ్లాక్ మార్కెట్ విక్రయాలను అరికట్టాలి

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

కల్తీ మద్యం, బ్లాక్ మార్కెట్ విక్రయాలు అరికట్టాలని కాకినాడ మాజీ మేయర్, జిల్లా తెలుగుదేశం పార్టీ మహిళా అధ్యక్షురాలు సుంకర పావని తిరుమలకు కుమార్ ఆధ్వర్యంలో ప్రధాన కార్యదర్శి లీలా ప్రశాంతి, తెలుగు మహిళా నాయకురాలు సోమవారం జిల్లా కలెక్టర్ కృతిక శుక్లాకు వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలో కల్తీ మద్యం అమ్మకాల వల్ల మద్యం సేవించిన చాలామంది తీవ్ర అనారోగ్యాల పాలై మరణిస్తున్నారని తెలిపారు. పభుత్వం వెంటనే స్పందించి కల్తీ మద్యం అరికట్టి, బ్లాక్ మార్కెట్లో అమ్మకాలను విక్రయించ కుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

బదిలీ అయిన కమిషనర్ రమేష్‌ను సత్కరిస్తున్న కార్పొరేషన్ సిబ్బంది

మాజీ కమిషనర్ రమేష్‌కు ఆత్మీయ వీడ్కోలు

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్‌గా ఇప్పటి వరకు పనిచేసి బదిలీపై వెళుతున్న కె.రమేష్‌కు సోమవారం కార్పొరేషన్ అధికారులు, ఉద్యోగులు ఆత్మీయ వీడ్కోలు పలికారు. అదనపు కమిషనర్ సిహెచ్ నాగ నరసింహారావు ఆధ్వర్యంలో కార్పొరేషన్ కార్యాలయ సమావేశ మందిరంలో వివిధ విభాగాదిపతులు,, ఉద్యోగులు కమిషనర్ రమేష్‌ను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా తొలుత ఎడిసి నాగ నరసింహారావు మాట్లాడుతూ అధికారులు, ఉద్యోగులను సమన్వయం చేసుకుంటూ ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో కమిషనర్ రమేష్ ఎంతో సహకారం అందించారన్నారు. తనకు జరిగిన సత్కారానికి కమిషనర్ రమేష్ ధన్యవాదాలు తెలియజేస్తూ, ప్రజా ప్రతినిధులు, అధికారులు, ప్రజల సహకారంతో కాకినాడలో సంతప్తికరమైన సేవలు అందించగలిగానన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్, స్మార్ట్ సిటీ ఎస్‌ఈ వెంకట్రావు, ఎంహెచ్‌ఓ డాక్టర్ పృధ్వి చరణ్, మేనేజర్ కర్రి సత్యనారాయణ, డిసిపి హరిదాసు, ఏసీపీ నాగశాస్త్రులు, ఆర్వో చెక్కా రమణ, ఏవో శిరీష్, టిపిఆర్‌ఓ మానే కృష్ణమోహన్, ఆయా విభాగాలు సూపరింటెండెంట్లు, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

డిఎలు చెల్లించాలని ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి - కాకినాడ

రాష్ట్రంలో ఇప్పటివరకు ఏ ప్రభుత్వం కూడా ప్రభుత్వ ఉద్యోగులకు 7 డిఏలు బకాయిలు ఉన్న పరిస్థితి దేశ చరిత్రలో ఎక్కడా లేదని కానీ అది ఆంధ్రప్రదేశ్ లో మాత్రమే కనిపిస్తున్న దుస్థితి ఏర్పడిందని ఎపి జెఎసి అమరావతి కాకినాడ శాఖ ఉద్యోగుల సంఘం నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం జెఎసి రాష్ట్ర శాఖ దశలవారీ పోరాటంలో భాగంగా తమకు రావాల్సిన బకాయిలు చెల్లించాలని, అత్యవర సమయంలో ఉపయోగం కోసం దాచుకున్న జిపిఎఫ్ సొమ్ములు కూడా సకాలంలో అందక కుటుంబం సభ్యుల అనారోగ్యం పాలైతే మెరుగైన వైద్యం చేయించుకోలేని పరిస్థితిలో నేడు రాష్ట్రంలోనే ప్రభుత్వ ఉద్యోగులు దుర్భర జీవితం గడుపడం దేనికి సంకేతం అని అన్నారు. పిల్లల యుక్త వయస్సు దాటిన వారికి వివాహాలు ృ చేయలేని స్థితిలో ఉన్నారని తెలిపారు. కనీసం తమ పే స్కేల్ గణాంకాలు ఎలా ఉన్నాయో అనే సమాచారం ఇవ్వకపోవడం ఈ ప్రభుత్వం అనుసరిస్తున్న నిరంకుశ వైఖరి తెలుస్తోందన్నారు. ఎన్నికల ముందు ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికుల సంక్షమానికి మేలు చేస్తారని చెప్పి నేటికి రూ.22 వేల కోట్ల సొమ్ములు బకాయిలు పెట్టి, వాటిని ఇమ్మని అడిగితే నేరస్తులుగా జమకట్టడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. పలు దఫాలు ప్రభుత్వ ప్రతినిధులతో సమస్య విన్నవించుకున్నా ఫలితం లేకపోవడంతో తిరిగి దశల వారీగా శాంతియుతంగా నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో పితాని త్రినాధరావు, శ్రీనివాస్ రావు, దుర్గాప్రసాద్ తదితులున్నారు.

నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలియజేస్తున్న ఎపి జెఎసి నాయకులు

మాజీ సర్పంచ్‌కు స్థిర నివాసం కల్పించండి

- జనసేన ఆధ్వర్యంలో ఆర్‌డిఒకు వినతి

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం మండలం తూర్పు పాకలు గ్రామం మాజీ సర్పంచ్ సురవరపు సుబ్బాయమ్మ వృద్ధాప్యంలో నిలువ నీడ లేక అవస్థలు పడుతున్నందున ఆమెకు స్థలం కేటాయించి ఉచితంగా ఇల్లు కట్టించి ఇవ్వాలని జనసేన నియోజకవర్గ ఇన్చార్జ్ తుమ్మల రామస్వామి (బాబు)సోమవారం ఆర్‌డిఒ జె సీతారామారావుకు వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లా డుతూ 30 ఏళ్ల క్రితం తూర్పు పాకల గ్రామంతో బయటి గ్రామాలకు సరైన రహదారి సౌకర్యం లేని సమయంలో ఆమె సర్పంచ్‌గా ప్రస్తుతం ఉన్న వంతెన నిర్మాణానికి విశేషంగా కృషి చేశారన్నారు. ఆమె దీనస్థితిని చూసి గ్రామ పెద్దలు గ్రామంలో సగం కట్టి వదిలేసిన ప్రభుత్వ భవనంలో తల దాచుకునేలా ఏర్పాట్లు చేశారన్నారు. సర్పంచ్‌గా ఆమె చేసిన సేవలకు గుర్తింపుగా ఆమెకు ప్రభుత్వం ద్వారా స్థలం కేటాయించి ఉచితంగా ఇల్లు నిర్మించి ఇవ్వాలని ఆయన విజ్ఞప్తి చేశారు. దీనికి ఆర్‌డిఒ సానుకూలంగా స్పందించారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో తూర్పు పాకల గ్రామ పెద్దలు ఉలవ కాయల బాబి,పసుపులేటి దుర్గ బాబు,పేరెపురెడ్డి వీరబాబు, తోట శ్రీను, లక్కాకుల వీరబాబు, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జనసేన ఉపాధ్యక్షురాలు సుంకర కృష్ణవేణి, నియోజకవర్గ సమన్వయకర్త ఎం సాయి, వీర మహిళ పెంకె వెంకటలక్ష్మి, త్రిపురగిరి చంద్రముఖి, జనసేన యువత అధ్యక్షులు తమనార లక్ష్మణ్ దివాకర్, మలిరెడ్డి బుచ్చిరాజు, కండవిల్లి సత్య నారాయణ, సమ్మంగి సాయి, జక్కుల అభి తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌డిఒ కార్యాలయం వద్ద విలేకరులతో మాట్లాడుతున్న రామస్వామి

అంబేద్కర్ జయంతిన మద్యం షాపులు మూసివేయాలి

ప్రజాశక్తి - పిఠాపురం

డాక్టర్ బి.ఆర్ .అంబేద్కర్ జయంతి ఏప్రిల్ 14న రాష్ట్రవ్యాప్తంగా మద్యం షాపులు మూసివేయాలని మద్యపాన వ్యతిరేక ప్రచార కమిటీ, జన విజ్ఞాన వేదిక, దళిత సంఘాలు, ప్రజా సంఘాల నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం తహశీల్దార్, స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో (ఎస్ఇబి) అధికారులకు వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వివిధ సంఘాల, దళిత సంఘాల నాయకులు మాట్లాడుతూ గాంధీ జయంతికి మద్యం షాపులకు సెలవు దినంగా ప్రకటిస్తుందని అలాగే ఏప్రిల్ 14న అంబేద్కర్ జయంతి కూడా సెలవుదినంగా ప్రకటించాలన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఎన్నికల మేనిఫెస్టోలో మద్యాన్ని నిషేధిస్తానన్న హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మద్యపాన వ్యతిరేక ప్రచార కమిటీ జిల్లా కన్వీనర్ డాక్టర్ ఎన్ సూర్య నారాయణ, జన విజ్ఞాన వేదిక జిల్లా నాయకులు వి.సత్యనారాయణ రెడ్డి, ఏలేటి నాని బాబు, వనపర్తి సూర్యనారాయణ, ఆంధ్రప్రదేశ్ మాల మహా గర్జన రాష్ట్ర అధ్యక్షులు దానం లాజర్ బాబు, కుల వివక్షత వ్యతిరేక పోరాట సంఘం(కెవిపిఎస్) జిల్లా కన్వీనర్ కె.సింహాచలం, న్యాయవాది కొంగు నూకరాజు , దళిత బహుజన పార్టీ నాయకులు రాజాల నాగేశ్వరరావు, జెవివి నాయకులు గుర్రాల ప్రసాదు తదితరులు పాల్గొన్నారు.

తహశీల్దార్ కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ప్రభుత్వ భూమిని పరిరక్షించాలని ఆర్‌డిఒకు వినతి

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం మండలం దివిలి గ్రామంలోని సర్వే నంబర్ 9 లో సుమారు 57 సెంట్లు విలువైన ప్రభుత్వ భూమిని కొంతమంది మతం ముసుగులో కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని వెంటనే ఈ భూమిని పరిరక్షించాలని కోరుతూ ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు కొత్తెం వెంకట శ్రీనివాసరావు (కోటి) సోమవారం ఆర్డిఓ జె సీతారామారావుకు వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ భూమి ఎంతో విలువైనదని ఈ భూమిని ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. వెంటనే ఈ భూమి వద్ద ఇది ప్రభుత్వ భూమి అని బోర్డులు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.దీనిపై ఆర్‌డిఒ సీతారామారావు పరిశీలిస్తామని హామీ ఇచ్చారు.

ఆర్‌డిఒ సీతారామారావుకు సమస్యను వివరిస్తున్న ఎంఎల్ఎ చినరాజప్ప

యానాం వార్తలు

నీటి ఎద్దడి నివారణకు కార్యాచరణ

ప్రజాశక్తి - యానాం

పంప్ హౌస్ పనులను పరిశీలిస్తున్న ఎంఎల్ఎ అశోక్

వేసవి కాలంలో తాగు నీటి ఎద్దడి తలెత్తకుండా పటిష్ఠమైన నివారణ చర్యలు చేపట్టాలని ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ మేరకు సోమవారం నీటి ఎద్దడి నివారణకు చేపట్టవలసిన చర్యలపై సంబంధిత అధికారులతో సమీక్షించి,యానాం కనకాల పేట శివారులో ఉన్న వాటర్ పంపు హౌస్‌ను ఆయన పరిశీలించారు. ఈ ఏడాది వేసవిలో అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందనే హెచ్చరికలు దృష్టిలో పెట్టుకుని కార్యచరణ రూపకల్పన చేయాలని అన్నారు. దీనిపై ఆంధ్రప్రదేశ్ ఇరిగేషన్ డిపార్ట్మెంట్ తో మాట్లాడినట్లు తెలిపారు. మంచినీటి చెరువులను ముందస్తుగా నింపాలని, యానాం ప్రజలందరూ నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పిడబ్ల్యుడి శాఖకు సంబంధించిన అధికారులు పాల్గొన్నారు.

విజేతలకు చెక్కును అందిస్తున్న ఆర్‌ఎఒ మునుస్వామి

క్విజ్ పోటీల్లో వికలాంగ విద్యార్థులకు ద్వితీయ స్థానం

బెంగళూరుకు సంబంధించిన సేవా ఇన్ యాక్షన్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి క్విజ్ పోటీలలో యానాం ఉమా ఎడ్యుకేషనల్ అండ్ టెక్నికల్ సొసైటీ మానసిక దివ్యాంగుల ప్రత్యేక పాఠశాల విద్యార్థులు ద్వితీయ స్థానం సాధించినట్లు చైల్డ్ లైన్ కోఆర్డినేటర్ కె శ్రీనివాస్ తెలిపారు.ఈ సందర్భంగా గెలుపొందిన విద్యార్థులు సన్నంశెట్టి సాయి విరాట్, సంగాడి ఏసు రాజులకు ఆర్ ఏ ఓ మునిస్వామి చేతుల మీదుగా సోమవారం చెక్కును అందజేశారు. కార్యక్రమంలో సోషల్ వెల్ఫేర్ అధికారి రెయ్యా శ్రీనివాసు,చైల్డ్ లైన్ సిబ్బంది తాతారావు,నూక రత్నం,విజయలక్ష్మి,డి వీరవేణి, షరీఫ్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

13న రక్తదాన శిబిరం

ఎంఎల్ఎ అశోక్‌కు ఆహ్వానిస్తున్న నిర్వాహకులు

ఏప్రిల్ 14న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతిని పురస్కరించ ఎకుని స్థానిక ఎస్‌టిపిపి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కనకాల రాజు, వడ్డీ ఏడు కొండలు, సబ్బతి లోకేశ్వర రావుల ఆధ్వర్యంలో ఈనెల 13వ తేదీ గురువారం రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్, ఆర్ఎఒ మునిస్వామి, మున్సిపల్ కమిషనర్ ద్విజ్ గోయల్, ఎస్‌పి రఘునాయిగం పాల్గొంటున్నట్టు తెలిపారు. ఈ మేరకు ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ చేతుల మీదుగా రక్తదాన శిబిరం యొక్క ఆహ్వాన పత్రాన్ని ఆవిష్కరించారు.

భీమేశ్వరాలయంలో 'జయహో జనార్ధన్' చిత్ర యూనిట్ సందడి

ప్రజాశక్తి-రామచంద్రపురం



ఆలయంలో చిత్ర యూనిట్

ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో జయహో జనార్ధన్ చిత్ర యూనిట్ సందడి చేసింది. పానుగంటి ప్రొడక్షన్స్ పై నిర్మిస్తున్న పానుగంటి శరత్ రెడ్డి నిర్మాత స్వీయ దర్శకత్వంలో ఈ సినిమా షూటింగ్ ద్రాక్షారామ పరిసరాలు, కోనసీమ పరిసర ప్రాంతాల్లో రెండో షెడ్యూల్ పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా చిత్ర యూనిట్, నటీనటులు సోమవారం భీమేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఈ చిత్రంలో హీరోగా విక్రమ్ కష్ణ, హీరోయిన్ గా రమ్యశ్రీ నటిస్తుండగా, ముఖ్యపాత్రలో చలాకీ చంటి, అదుర్స్ రఘు, మైమ్ మధు, దయానంద్, జబర్దస్త్ రాజమౌళి, బివిఎం శివశంకర్, నెమలి రాజు నటిసున్నారు.

లయన్స్ విజన్ ఆధ్వర్యంలో నిత్యావసరాలు

ప్రజాశక్తి - కాకినాడరూరల్

నిత్యావసరాలు అందజేస్తున్న దృశ్యం

రమణయ్యపేట ఎపిఐఐసి కాలనీలో లయన్స్ క్లబ్ కాకినాడ విజన్ ఆధ్వర్యంలో దీర్ఘకాలిక రోగులకు నిత్యవసర సరుకుల పంపిణీ చేశారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా లయన్స్ జిల్లా మాజీ గవర్నర్ లింగమల్లు కృష్ణమూర్తి మాట్లాడుతూ అంతర్జాతీయ లయన్స్ క్లబ్ అన్నార్తులకు ఆహారాన్ని అందించాలనే లక్ష్యాన్ని నిర్దేశించిందన్నారు. అ దిశగా విజన్ క్లబ్ సభ్యులు ప్రతినెలా ప్రభుత్వ సామాన్య ఆసుపత్రిలో వందలాది రోగులకు, వారి సహాయ కులకు నాణ్యమైన ఆహారాన్ని అందిస్తూ, ప్రతి నెల దీర్ఘకాలిక రోగులకు బియ్యం, నిత్యవసర సరుకులు సమకూరుస్తున్నారన్నారు. అనంతరం క్లబ్ సభ్యులు కృష్ణమూర్తిని ఘనంగా సత్కరించారు. క్లబ్ కార్యదర్శి నాగిరెడ్డి లక్ష్మి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో శ్రీవాణి, న్యాయవాది యనమల రామం, డాక్టర్ శిరీష, అడబాల రత్న ప్రసాద్, రేలంగి బాపిరాజు పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రిలో అన్నదానం

ప్రజాశక్తి - ఏలేశ్వరం

తమ 25వ పెళ్లిరోజు జరుపుకుంటున్న ప్రత్తిపాడు మండలం వొమ్మంగి గ్రామానికి చెందిన మామిడి నరసింహమూర్తి, అనంతలక్ష్మి దంపతులు ప్రత్తిపాడు ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో అన్నదానం ఏర్పాటు చేశారు. ఎంపిపి గొల్ల క్రాంతి సుధాకర్, తహశీల్దార్ పిండి గోపాలకృష్ణ మాట్లాడుతూ పుట్టినరోజులు, పెళ్లి రోజులు పేరుతో ధనాన్ని వృథా చేయకుండా సేవా కార్యక్రమాలు చేపట్టడం హర్షనీయమన్నారు. కార్యక్రమంలో జెసిఎస్ ఇన్చార్జ్ రామిశెట్టి చిన్నబాబు, ఏనుగు శ్రీనివాస్, సొసైటీ చైర్మన్ గొంతెన సురేష్, మండల విద్యాధికారి పవన్ కుమార్ వైద్యుల గీతాసుధ ఉన్నారు

ఆర్య వైశ్య సేవా సంఘం ఎన్నిక

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం ఆర్యవైశ్య సేవా సంఘం నూతన కమిటీ ఎంపిక ఏకగ్రీవంగా జరిగింది. పారిశ్రామిక వేత్త మట్టే శ్రీనుబాబు అధ్యక్షతన సంఘ భవనంలో సోమవారం జరిగిన సర్వసభ్య సమావేశంలో ఏకగ్రీవంగా నూతన కమిటీని ప్రకటించారు. గౌరవాధ్యక్షులుగా తమ్మన శ్రీనివాసరావు, కొత్త రెడ్డయ్య, వేముల కృష్ణ,అధ్యక్షులుగా మట్టే శ్రీనివాసరావు,ఉపాధ్యక్షులుగా మండవిల్లి శ్రీనివాస్, బొండాడ సరన్న, అద్దేపల్లి చినబాబు, కాపుగంటి కామేశ్వరరావు, కార్యదర్శిగా గ్రంధి గోపాల్, సహాయ కార్యదర్శులుగా వేముల సతీష్,తాళ్లూరి శ్యామ్,అద్దేపల్లి రమేష్,జల్లూరి వీర్రాజు,కోశాధికారిగా శ్రీరామ్ ప్రకాష్,అడ్వైజరీ కమిటీ సభ్యులుగా తాళ్లూరి ప్రసాద్, మండవిల్లి భాస్కరరావు, పెనుగొండ వెంకటరావు, తమ్మన సత్యనారాయణలతో పాటు మరో 13 మందిని కమిటీ సభ్యులుగా ఎంపిక చేశారు.

పెద్దాపురంలో 'మా నమ్మకం నువ్వే జగనన్న'

ప్రజాశక్తి - పెద్దాపురం

పట్టణ పరిధిలోని పలు వార్డులలో ,మండల పరిధిలోని పలు గ్రామాల్లో సోమవారం మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమాన్ని ర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు కట్టా రాజబాబు, ఆరేళ్ల వీరరాఘవ, వాసంశెట్టి గంగ, నీలంశెట్టి అమ్మాజీ, తాటికొండ వెంకటలక్ష్మి, పెంటకోట సత్తిబాబు, పప్పల దుర్గ, యండమూరి విజయలక్ష్మి,తూర్పు పాకలు వైసిపి ఇంచార్జ్ పడాల వీర రాఘవులు, తదితరులు పాల్గొన్నారు.

రోగులకు పండ్లు అందజేస్తున్న లయన్స్ క్లబ్ నాయకులు

పలువురికి భోజనాలు అందజేత

ప్రజాశక్తి -తాళ్ళరేవు

స్థానిక తాళ్లరేవు లయన్స్ క్లబ్ పేదలకు ఉచితంగా భోజనం అందించే లయన్ కొప్పిశెట్టి లక్ష్మయ్య బ్రహ్మార్పణ పథకానికి సోమవారంతో వంద రోజులు పూర్తి చేసుకున్నట్లు తాళ్లరేవు లయన్స్ క్లబ్ అధ్యక్షులు బిల్లకుర్తి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. తాళ్లరేవు డిప్యూటీ తహశీల్దార్ ఎం.సూరిబాబు తనయుడు అభిరామ్ పుట్టినరోజు సందర్భంగా సోమవారం పలువురు నిరుపేదలకు భోజనం క్యారేజీలు, పండ్లు అందజేశారు. తాళ్ళరేవు ఆసుపత్రి లో బాలింతలకు బ్రెడ్, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వంద రోజులుగా సహకరిస్తున్న దాతలకు క్లబ్ అధ్యక్షులు శ్రీనివాసరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తాహశిల్దార్ పోతురాజు, క్లబ్ కార్యదర్శి భగవాన్, దత్తు, సతీష్ రాజు, కొప్పిశెట్టి బాబి, శ్రీధర్, ఆదినారాయణ, రాయపరాజు, అందే కాశీరాజు, సిహెచ్‌సి వైద్యురాలు శిరీష తదితరులు పాల్గొన్నారు.

పాస్ పుస్తకాలు అందించాలని డిమాండ్

ప్రజాశక్తి-అమలాపురం

ముప్పై ఏళ్లగా సాగు చేసుకుంటున్న అసైన్డ్ రైతులకు వెంటనే పట్టాదారు పాసుపుస్తకాలు ఇవ్వాలని అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షులు జె సత్తిబాబు డిమాండ్ చేశారు. ఆలమూరు మండలం బడుగువానిలంకలో పట్టాదారులు 22 ఏళ్లగా సాగు చేసుకుంటున్న రైతులకు ప్రభుత్వ అడంగల్ లో పేర్లు నమోదు చేసి పట్టాదార్ పాస్ పుస్తకాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో సోమవారం అమలాపురంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని స్పందనలో కలెక్టర్ హిమాన్షు శుక్లాకు అందించారు. ఈ కార్యక్రమంలో పి డి ఎస్ యు విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు రేవు తిరుపతిరావు, రంప జాను, తుళ్లూరు ప్రేమఆనందం, ఉండ్రాజావరపు అబ్బులు, బడుగు వెంకట్రావు, బడుగు కళావతి, రాజు, ఉండ్రాజవరపు చంద్ర రావు, సూర్యారావుతదితరులు పాల్గొన్నారు.

పేదలకు అండగా సత్యసాయి సేవా సంస్థ

ప్రజాశక్తి -మామిడికుదురు

పేదలకు అండగా సత్యసాయి సేవా సంస్థ నిలుస్తుందని ఆ సంస్థ రాష్ట్ర అధ్యక్షులు ఆర్.లక్ష్మణరావు అన్నారు. వరద బాధితుల కోసం సంస్థ పెదపట్నం లంకలో 2, పాసర్లపూడిలంకలో 3, నిర్మించిన గృహాలను ఆయన సోమవారం ప్రారంభించారు. ఒక్కొక్క గృహ నిర్మాణానికి రూ.రెండు లక్షలు వెచ్చిం చామన్నారు. కార్యక్రమంలో సర్పంచులు సుందర నీడి రాజేష్ కుమార్, కొనుకు ప్రేమ జ్యోతి, తెల్లగా రెడ్డి సూర్యప్రకాశరావు, జిల్లా అధ్యక్షులు అడబాల కొండల బాబు, వై.గోవింద్ రావు, పాల్గొన్నారు.

మహారాజశ్రీ సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో :: అమలాపురం
ఓ.ఎస్.నెం. 20/2022

Between:
Yakkala Sri Lakshmi ...వాది
AND
Suggu Rekha and Others ...ప్రతివాదులు

పేపరు ప్రకటన

డి-3 ప్రతివాది:
Tata Alekya, W/o. Rajesh, D/o. Suggu Kasi Viswanadham, Suggu Plaza, D.No. 2-2-14, Near Subbalamma Temple, Devangula Street, Amalapuram, E.G.Dist.

పై నెంబరు దావాలో ఓ.ఎస్. నెం. 20/2022లో 3వ ప్రతివాది అయిన మీకు ఎన్ని పర్యాయములు దావా సమన్లు పంపినను మీకు అమలు జరిగియుండలేదు. శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం పేపరు ప్రకటన ద్వారా 3వ ప్రతివాది అయిన మీకు తెలియపరుచుచున్నాము. వాయిదా **ది.19-04-2023వ తేదీన మీరు స్వయంగా గాని, మీ ప్లీడరు గారి ద్వారా గాని వచ్చి 10:30 ని॥లకు శ్రీ కోర్టు వారి ఎదుట హాజరై మీ యొక్క అభ్యంతరములు తెలియపరుకోవలెను.** లేనిచో పరోక్షముగా తీర్మానితులు అవుదురు.

వాయిదా తేదీ: 19-04-2023, సమయం: 10:30 ని॥లకు

DOMMETI VENKATESWARA RAO
Advocate, Amalapuram.
Cell: 98498 61296

ఒరిజినల్ దస్తావేజు పోయినది

నా తండ్రిగారైన **దివ్వి రత్తాలు గారి కుమార్డు దివ్వి నారాయణరావు,** రాజమండ్రి కాపురస్తులు దివి. 02-04-2018వ తేదీన రిజిష్టర్డు స్థిరాస్తి సెటిల్‌మెంట్ **దస్తావేజు నెంబరు 1843 ఆఫ్ 2018** లే-అవుట్ ప్లాట్ నెంబరు 38, చ॥గ॥ 132-5లు, సమీప డోరు నెంబరు 4-80, పాలకొల్లు, ప॥గో॥జిల్లాలోనిది నాకు సంక్రమింప చేసిన దానిని దివి. 06-04-2023వ తేదీన ఉదయం సుమారు 11 గం॥లకు రాజమహేంద్రవరం పోస్టల్ కాలనీ, నారాయణి శ్రీనివాసం అపార్ట్‌మెంట్ డోర్ నెం. 79-7-44/11 నుండి ప్రకాష్‌నగర్, రాజమండ్రి రౌండు పార్కు వద్ద గల జిరాక్స్ సెంటర్‌లో కలరు జిరాక్స్ తీసుకునే నిమిత్తం వెళ్ళగా సదరు ఒరిజినల్ దస్తావేజు కవరుతో సహా నా వాహనం నుండి పడిపోయినది. ఎవరికైనా దొరికినచో మూడు రోజులలోగా నాకు తెలియచేయండి లేదా అందచేయండి.

దివ్వి అయ్యప్పస్వామి
డో.నెం. 79-7-44/1,
నారాయణి శ్రీనివాసం అపార్ట్‌మెంట్
రాజమండ్రి పోస్టల్ కాలనీ, రాజమండ్రి
10-4-2023 సెల్: 8421768833

మహారాజశ్రీ రాజమహేంద్రవరం గౌరవనీయులైన 5వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో
ఎ.యస్. నెం. 265/2018

పార్టీలు:
తూలూరి వీర్రాజు **-అప్పిలెంటు**
మరియు
కొత్తపల్లి రాజ్‌కుమార్ **-రెస్పాండెంటు**

కొత్తపల్లి రాజ్‌కుమార్, (తండ్రి) అబ్దుల్ సయ్యద్, హిందువు, వయస్సు 36 సం॥లు, బాలాజీపేట, రాజమహేంద్రవరం, తూర్పుగోదావరి జిల్లా.

పై అప్పిలెంటు మీపై దాఖలు చేసిన పై అప్పీలు మీ హాజరు నిమిత్తము పై కోర్టులో ది. 25-04-2023వ సం॥రం తేదీకు వాయిదా అయి వున్నది. కావున మీరు పై కోర్టు ఎదుట **ది. 25-04-2023వ సం॥రం తేదీ ఉదయం గం॥ 10.30 ని॥లకు** స్వయముగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని పై కోర్టు ఎదుట హాజరై మీ అభ్యంతరములు తెలియపర్చుకోగలరు. లేని యెడల పై అప్పీలు మీ పరోక్షమున నిర్ధారింపబడును.

యమ్.ఆర్.సత్యసాయి (రాంబాబు)
పిటిషనర్ తరపున అడ్వకేట్
డోరు నెం. 86-11-11/1
వాడ్రేవునగర్, తిలక్‌రోడ్డు
రాజమహేంద్రవరం